క్లుప్తంగా

భద్రతా ప్రమాణాలు పాటించాలి



మంగపేట: మండలంలో దీపావళి బాణాసంచా విక్రయాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ములుగు అగ్నిమాపక కేంద్రం ఎస్‌హెచ్‌ఓ, ఏటూరునాగారం ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ కంది కుమారస్వామి అన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, రాజుపేటలోని దీపావళి బాణాసంచా దుకాణాలను ఆయన ఆదివారం సాయంత్రం పరిశీలించారు. దీపావళి మందులు విక్రయిస్తున్న షాపుల నిర్వాహకులకు అనుమతులు ఉన్నాయా భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారా అని పరిశీలించారు. జనసంచారంతో రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్లు, రోడ్డు వెంట ఏర్పాటు చేసిన దుకాణాల యజమానులు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రమాదం సంభవిస్తే నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రధానంగా షాపుల వద్ద డ్రమ్ముల్లో నీరు, బకెట్లలో ఇసుక నింపి ఉంచాలని, హై ప్రెషర్ సిలిండర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. హైప్రెషర్ సిలిండర్‌ను వినియోగించే విధానంపై ఆయా షాపుల యజమానులకు అవగాహన కల్పించారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

వెంకటాపురం(కె): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికలకు ముదు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనం అమలు చేయలేదని అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లకు వేతనాన్ని నేరుగా వారి ఖాతాల్లోనే జమచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొక్కుల రాజేందర్, కొడయ్య, నాయకులు కట్ల రాజు, రమేశ్, కుడుముల సమ్మక్క ఉన్నారు.

క్రికెట్ బ్యాట్ అందజేత

కాటారం: కేపీఎల్ క్రికెట్ టోర్నీలో భాగంగా కాటారం క్రీడాకారులకు మద్ది కొండయ్య స్మారకార్థం ఆయన కుమారుడు మద్ది సూర్యనారాయణ క్రికెట్ బ్యాట్ బహూకరించారు. మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి పాల సరఫరాకు హనుమకొండకు చెందిన మహేందర్‌రెడ్డి ములుగులో పాల ప్యాకెట్లను సరఫరా చేసేందుకు టాటాఏసీ వాహనంలో తీసుకుని వచ్చాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం వెపు వెళ్తున్న కారు పాలు దిగుమతి చేస్తున్న మహేందర్‌రెడ్డిని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో మహేందర్‌రెడ్డి రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన షాపు యజమాని 108కు సమాచారం అందించి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రోడ్డు ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనం తో పాటు వాహనం నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

'మల్చింగ్' సాగుకు మొగ్గు

- ఆసక్తి చూపుతున్న మిర్చి రైతులు
- తగ్గుతున్న పెట్టుబడి



మల్చింగ్ విధానంతో సాగు చేసిన మర్చి పంట(ఫైల్)

మొగుళ్లపల్లి: మండలంలోని మిర్చి పంట వేసే రైతులు మల్చింగ్ పద్ధతిలో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం మిర్చి సాగు పనులు జోరందుకున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండగా మారడంతో పాటు వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో కొందరు రైతులు సాధారణ పద్ధతిలో మిర్చి సాగు చేస్తుండగా.. ఎక్కువ మంది రైతులు మల్చింగ్ పద్ధతిలో మిర్చి సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సాగుతో చీడపీడల నివారణ, కలుపు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించవచ్చని తెలుపుతున్నారు. మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, పర్లపల్లి గ్రామాల్లో మల్చింగ్ పద్ధతిని అవలంభిస్తూ రైతులు మిర్చి పంట సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 700 ఎకరాలు మిర్చి సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వీటిలో 80 శాతం పైగా మల్చింగ్ సాగుపై రైతులు దృష్టి పెడుతున్నట్లు చెబుతున్నారు.

మల్చింగ్‌తో ఉపయోగాలు..

మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా నివారించడం వల్ల వివిధ కాలపరిమితులు గల పంటలకు 30–40 శాతం వరకు నీరు ఆదా అవుతుంది. దీనిని డ్రిప్ సిస్టం సేద్యం పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20శాతం నీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు.

సాగు చేసే విధానం..

మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూరా 5 సెం.మీ. నుంచి 10 సెం.మీ. లోతు గాడి చేయాలి. మల్చింగ్ షీట్‌ను కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతీ వరుసలో లేదా చెట్టు దగ్గర వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను యాంకరింగ్ అని అంటారు. దీనివల్ల మాల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

కూలీల కొరతను నివారించవచ్చు



కొన్నేళ్లుగా మల్చింగ్ విధానంతో మిర్చి సాగు చేస్తున్నా. ఈ సంవత్సరం ఏడు ఎకరాల్లో ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉంటుంది. తద్వారా కూలీల కొరతను నివారించవచ్చు. ఎరువుల వాడకం కూడా తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసుకోవచ్చు.

– అన్నమనేని భూమారావు, రైతు, రంగాపురం

ప్రమాదకరంగా రహదారులు

- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మలుపు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

చిట్యాల: మండలంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. చిట్యాల మండల కేంద్రం నుంచి నవాబుపేటకు వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో మలుపు వద్ద, మండల కేంద్రంలోని బియ్యం గోదాం సమీపంలోని చెరువుకట్ట కింద ఉన్న మలుపు వద్ద ఎదురుగా ఏలాంటి వాహనాలు వచ్చిన కనబడకుండా పిచ్చి మొక్కలు ఎపుగా పెరిగాయి. గతంలో హరితహారంలో నాటిన మొక్కలతో పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద ఏపుగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనాదారులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి



రోడ్డు వెంట హరితహారంలో నాటిన మొక్కలతో పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. సంబందిత అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలి.

– ఏలేటి రాజు, ఏఆర్‌పల్లి

ఆర్టీసీ బస్సు ట్రిప్పులు పెంచాలి

చిట్యాల: భూపాలపల్లి నుంచి చిట్యాల మీదుగా జమ్మికుంటకు ఆర్టీసీ బస్సు ట్రిప్పులు పెంచాలని మాజీ ఎంపీటీసీ గుర్రపు సునీతతిరుపతిగౌడ్ కోరారు. ఆదివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జమ్మికుంటకు ప్రతీ రోజు అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తున్నారని అన్నారు. జమ్మికుంట కేంద్రంగా చేసుకుని రైలుమార్గం ద్వారా ప్రయాణికులు హైదరాబాద్, మంచిర్యాల, బెల్లంపెల్లి తదితర పట్టణాలకు వెళ్తున్నట్లు తెలిపారు. అలాగే బస్సు సౌకర్యంతో కరీంనగర్, హుజూరాబాద్, వేములవాడ, కొండగట్టు తీర్థయాత్రలకు ఈ దారి గుండానే భక్తులు వెళ్తున్నారని అన్నారు. వచ్చే ఏడాదిలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరు వేళ్లే ముందు భక్తులు వేములవాడకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కొంత కాలం నుంచి హుజూరాబాద్ డిపో బస్సు జమ్మికుంట నుంచి చిట్యాల మీదుగా భూపాలపల్లికి ఉదయం, మధ్యాహ్నం మాత్రమే ఉండడంతో అనేక మంది ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. కావున సంబంధిత ఆర్టీసీ అధికారులు, కలెక్టర్ స్పందించి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించి భూపాలపల్లి నుంచి జమ్మికుంటకు చిట్యాల మీదుగా బస్సు ట్రిప్పులను నడిపించాలని ఆమె కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న వెంటకరమణారెడ్డి

రేగొండ: మండలంలోని రావులపల్లిలో ఏడెల్లి వెంకట్‌రెడ్డి, అన్నారపు రమ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు చంద్రాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.



మల్హర్: పరామర్శిస్తున్న మధు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామాని చెందిన రామయ్య, స్వరూప ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు మధుసూదన్‌రావు, సదానందం, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

కమిటీల ఎన్నిక



నాచారంలో కమిటీ సభ్యులతో నాయకులు

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి, నాచారం గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నూతన యూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అన్సాన్‌పల్లి గ్రామ యూత్ అధ్యక్షుడిగా కుడుముల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అల్లూరి మధుకర్, ప్రధాన కార్యదర్శిగా నాంసాని కుమార్, కార్యదర్శిగా జాటోత్ సమ్మయ్య, కోశాధికారిగా కాసర్ల రమేశ్, అధికార ప్రతినిధిగా భూక్య శ్రీనివాస్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా గాబోయిని నవీన్‌ను ఎన్నుకున్నారు. అలాగే నాచారం గ్రామ యూత్ అధ్యక్షుడిగా కోట శ్యాం సుందర్, ఉపాధ్యక్షుడిగా దుండ్రా అనిల్, ప్రధాన కార్యదర్శిగా బండ రఘు, కార్యదర్శిగా బోయిని వెంకటేష్, కోశాధికారిగా ఇస్నపు అనిల్, అధికార ప్రతినిధిగా కన్నూరి వెంకటేష్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా బానోత్ మహేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, మండల ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మండల రాహుల్, మాజీ సర్పంచ్ జగన్ నాయక్, మాజీ ఎంపీపీ ఇసనపురవు, మంథని మార్కెట్ డైరెక్టర్ దూలం సులోచన పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రేగొండ: మండల కేంద్రానికి చెందిన బండి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను రేగొండ గౌడ సంఘం నాయకులు పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రేణుక ఎల్లమ్మ గుడి చైర్మన్ ఉమేష్ గౌడ్, నాయకులు మల్లేష్, శంకర్, సుదర్శన్, వెంకన్న, సతీష్, మల్లయ్య, శేఖర్, వీరస్వామి, శ్రీను, మాడగాని సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

శాయంపేట: మండలంలోని మాందారిపేట గుట్టల్లో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లిగోరి మండలంలోని చెంచుపల్లె గ్రామానికి చెందిన కొమురిగిరి వెంకటమ్మ (40) కూలి పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తుండేది. వెంకటమ్మకు జ్వరం రావడంతో శనివారం రేగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లినట్లు కుమారుడు కుమారస్వామికి తెలిపింది. కానీ, రాత్రి వరకు వెంకటమ్మ ఇంటికి రాకపోవడంతో కుమారస్వామి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కుమారస్వామి ఆదివారం కొత్తపల్లిగోరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంకటమ్మ ఫోన్ నంబర్‌తో లొకేషన్ ట్రేస్ చేసి మండలంలోని మాందారిపేట గుట్టల వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా.. వెంకటమ్మ వెంకటమ్మ అప్పటికే మృతి చెంది కన్పించింది. ముక్కు నుంచి తెల్లటి నురగ రావడంతో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు గుర్తించారు. వెంకటమ్మ కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి



బహుమతులు అందజేస్తున్న శ్రీనుబాబు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు

కాటారం: యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. కాటారం మండలం ధన్వాడ గ్రామంలో నిర్వహించిన డీపీఎల్–10 క్రికెట్ టోర్నీ విజేతలు ప్రథమ స్థానంలో నిలిచిన జీసీఏ టీం, ద్వితీయ స్థానంలో నిలిచిన హరీష్–11 జట్లకు ట్రోఫీలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ధృడత్వం, పట్టుదల, జట్టు స్ఫూర్తి వంటి విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత సామాజిక సేవ, ప్రజాసేవ రంగాల్లో ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కోట రాజబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, భూపెల్లి రాజు, ఆజ్మీర శ్రీకాంత్‌నాయక్, చల్ల తిరుపతయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధనసరి సూర్య



విజేత జట్టుకు నగదు, కప్‌ను అందజేస్తున్న సూర్య

ఏటూరునాగారం: క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలని కాంగ్రెస్ యువజన రాష్ట్ర నాయకుడు ధనసరి సూర్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వంగరవి జట్టు గెలుపొందగా రూ.50వేల నగదు, కప్‌ను అందజేశారు. అనంతరం సూర్య మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడల్లో ఉత్సహంగా పాల్గొని స్నేహాన్ని మరింత పెంచుకోవాలన్నారు. ఏటూరునాగారంలో పది రోజులుగా వంగ రవి యాదవ్ యువసేన క్రికెట్ జట్టు క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి, వసంత శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా షాపులు



టెంట్ల కింద ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

వెంకటాపురం(కె): మండలంలో బాణసంచా దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారు. జనావాసాల మధ్యలో దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఫైర్ అధికారులు క్షేత్ర స్థాయిలోకి వచ్చి రేకుల షెడ్ ఏర్పాటు చేసుకున్న తర్వాత పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. అందుకు విరుద్ధంగా అధికారులు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. షాపు ఏర్పాటుకు రేకుల షెడ్ వేయకుండా టెంట్లు ఏర్పాటు చేసుకోని విక్రయాలు చేస్తున్నారు. లూప్ లైన్ విద్యుత్ కనక్షన్లు కాకుండా పర్మినెంట్ వైరింగ్ చేసుకోవాలని నిబంధన ఉన్నప్పటికి లూప్ లైన్ విద్యుత్ కనక్షన్లు ఏర్పాటు చేసుకున్నారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకోకుండా ఇసుక, మంటలను అదుపు చేసే పరికరాలను ఉంచాలి. కానీ దుకాణాల వద్ద ఏలాంటి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిమితికి మించి ప్రయాణించొద్దు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై



పస్రాలో బాణసంచా దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై కమలాకర్

- పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: పరిమితికి ప్రయాణించొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. దీపావళి వేడుకల సందర్భంగా పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన పరిమితి అతిక్రమణపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రయాణం చేస్తున్న వాహనాలను ఆపి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం మండలంలో బాణసంచా విక్రయించే దుకాణాలకు పోలీసులు పరిశీలించారు. బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అని, అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరాలపై దాడులు

మండలంలోని చల్వాయి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు చల్వాయిలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో ఏడుగురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారి వద్ద నుంచి రూ.73,020 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు తెలుపాలన్నారు. 87126 70085 లేదా 87126 70086 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

వెంకటాపురం(కె): అక్రమంగా పశువులను తరలిస్తుండగా మండలంలో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిలా చర్ల మండలం నుంచి బోలెరో వాహనంలో నాలుగు ఆవులు, నాలుగు దూడలను అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. ఎడుచర్ల పల్లి, మరికాల రోడ్డులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన కొడారి రాంబాబు, ఆరుగు బాలాజీ అనే ఇద్దరిపై కేసు నమోదు చేశారు. బోలెరో వాహనాన్ని సీజ్ చేసి పట్టుకున్న పశువులను గోశాలకు తరలించారు.

బస్సులు వచ్చేదెప్పుడో?

- ఏటూరునాగారం డిపో మంజూరైనా వాజేడుకు రాని బస్సులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వాజేడు: మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి బస్ డిపోనే వస్తుందని అందుకు ప్రణాళికలను సిద్ధం చేశారని గతంలో ప్రచారం జరిగింది. కాని సమీప మండలమైన ఏటూరునాగారానికి డిపో మంజూరు కావడంతో వాజేడుకు నిరాశే మిగిలింది. పక్క మండలానికి బస్సు డిపో రావడంతో కనీసం బస్సులు వస్తాయనే ఆనందంలో మండలవాసులు ఉన్నారు. కానీ బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఖమ్మం జిల్లాలో ఉన్నప్పుడు భద్రాచలం డిపో నుంచి సుమారుగా 25 బస్సులు వచ్చేవి. అలాంటిది ఒక్కొక్కటిగా తగ్గిస్తూ నేడు కళాశాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సులు వచ్చి వెళ్తున్నాయి. మండలాన్ని తొలుత జయశంకర్ భూపాలపల్లి, తర్వాత ములుగు జిల్లాల్లో కలుపడంతో బస్సులు పూర్తిగా నిలిపి వేయబడ్డాయి. దీంతో ప్రయాణికులు బస్సులు ఏక్కాలంటే ఏటూరునాగారం, జగన్నాథపురం గ్రామాలకు ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

ఉపయోగపడని ఉచిత బస్సు ప్రయాణం

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వాజేడు మండల ప్రజలకు ఉపయోగపడటం లేదు. మండలానికి బస్సులు రాక పోవడంతో మండలంలోని మహిళలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోలేక పోతున్నారు. కేవలం దూర ప్రాంతాలకు వెళ్లిన సమయంలో మాత్రమే ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని ప్రతీ పల్లెకు ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నప్పటికీ వాజేడు మండలంలో మాత్రం బస్సులు కనిపించడం లేదు. కనీసం బస్ స్టాండ్ ఉండి ఉంటే ఏటూరునాగారం, భద్రాచలం, వెంకటాపురం(కె), చర్ల మండలాలకు వెళ్లే బస్సులు బస్ స్టాండ్‌కు వచ్చేవి. అలాంటి సమయంలో నైనా వాజేడు మండలానికి బస్సు సౌకర్యం కలిగేది. బస్ స్టాండ్ కూడా లేని పరిస్థితి. పాలకులు, అధికారులు ఇప్పటికైన స్పందించి బస్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వార్షికోత్సవంలో గీత కార్మికులు

గోవిందరావుపేట: గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు మద్దెల ఐలుమల్లు అన్నారు. మండల పరిధిలోని చల్వాయిలో గీత కార్మికుల ఉద్యమ వార్షికోత్సవాన్ని ఆదివారం గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు మద్దెల ఐలుమల్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వత్సవాయి సారయ్య గౌడ్ హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గీత కార్మికుల పరిస్థితులు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్నారు. సదానందం, చెవుగాని ఆంజనేయులు, మాచర్ల ఎలేంద్రం, చారగాని రామ్ పాల్గొన్నారు.